క్లుప్తంగా

బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: బాధితుల సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



ఏవోకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

జగిత్యాల: నాలుగో తరగతి ఉద్యోగుల శాశ్వత నియమకాలను చేపట్టి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కలెక్టరేట్ ఏవో హకీమ్‌కు తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జగిత్యాల జిల్లా శాఖ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, కారుణ్య నియమకాల విషయంలో 5 శాతం నిష్పత్తిని ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రయ్య, కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు



మాట్లాడుతున్న మారుతి

కథలాపూర్: వేములవాడలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల మనోభావాలు దెబ్బతీయకుండా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు వ్యవహరించాలని బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి డిమాండ్ చేశారు. సోమవారం కథలాపూర్‌లో మాట్లాడారు. అభివృద్ధి పేరిట రాజరాజేశ్వరస్వామిని భక్తులకు దూరం చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. రాష్ట్రంలో యాదాద్రి దేవాలయం అభివృద్ధి జరిగే క్రమంలో స్వామివారిని దూరం చేయలేదన్నారు. రాజన్న క్షేత్రంలోనే బాలాలయాన్ని ప్రాణ ప్రతిష్ఠ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం జీవన్‌రెడ్డి, మహేశ్, కాసోజి ప్రతాప్, కల్లెడ ప్రసాద్, మల్లేశ్, అనిల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగింపు

మల్లాపూర్: మండలంలోని హుస్సేన్‌నగర్ ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో ఈ నెల 10న పాము పిల్లలు ప్రత్యక్షమైన విషయం తెలిసిందే. కాగ ఆ పాఠశాల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను సోమవారం పంచాయతీ కార్యదర్శి సదన్ తొలగింపజేశారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు సన్మానం

మేడిపల్లి: మేడిపల్లి మండల ఎంపీడీవో దాదాపు రెండేళ్లకు పైగా సేవలందించి బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో పద్మావతికి మేడిపల్లి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, కార్యవర్గ సభ్యులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో భీమారం ఎంపీడీవో నీరజ, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శ చేపూరి నాగరాజు, డైరెక్టర్లు బలగం రాజేశ్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, బద్దం రాజేందర్ రెడ్డి, ముస్కెం జలందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేత



జగిత్యాల: డిగ్రీ పట్టా పొందడం ఎంతో అభినందనీయమని ఆర్‌కే విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. ఎస్‌ఎస్వీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న 280 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ముందు గ్రూప్–1, సివిల్‌సర్వీసెస్‌ల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో శ్రీపాద నరేశ్ పాల్గొన్నారు.

పాలన భారం.. దినదిన గండం

- అప్పుల పాలవుతున్న పంచాయతీ కార్యదర్శులు
- కార్మికులకు వేతనాలు కరువు
- ఎన్నికలు నిలిచిపోవడంతో మరింత ఆందోళన



లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ

జగిత్యాలరూరల్: జిల్లాలో గ్రామపంచాయతీ పాలన పంచాయతీ కార్యదర్శులకు నిత్యం గండంగా మారింది. గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన ఉండటంతో మొత్తం భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడుతోంది. పంచాయతీల్లో పారిశుధ్య పనులు, నీటి సరఫరా, ఏ చిన్న సమస్య తలెత్తినా పంచాయతీ కార్యదర్శి చేతి నుంచే డబ్బులు పెట్టి పనులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు తమ జీతాల నుంచి పంచాయతీల్లో చేసే పనులకు పెట్టుబడులు పెడుతూ అప్పులపాలవుతున్నారు. ప్రభుత్వం నుంచి గతేడాదిగా స్వచ్ఛదనం, పచ్చదనం, కార్మికులకు వేతనాల కోసం నిధులు మంజూరు చేయడం లేదు. కానీ ఆ బిల్లులను పంచాయతీ కార్యదర్శులు సమర్పించినా బిల్లులు పాస్ కాకపోవడంతో పారిశుధ్య కార్మికులు తమకు వేతనాలు ఇస్తేనే పనులకు వస్తామని లేకుంటే మానేస్తామని చెప్పడంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి కార్మికుల వేతనాలు కొంత చెల్లిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే రాష్ట్ర, కేంద్ర నిధులు వస్తాయని భావించినా ఎన్నికలు వాయిదా పడటంతో గ్రామాల్లో నిధుల కొరతతో అభివృద్ధి కుంటుపడనుంది.

అత్యవసర పనులకు తప్పని అప్పులు..

జిల్లాలోని గ్రామపంచాయతీల్లో అత్యవసర పనులు చేపట్టకపోతే ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో గ్రామాల్లో శానిటేషన్, బ్లీచింగ్, విద్యుత్ బల్బుల ఏర్పాటు, మోటార్ల రిపేరు, పైప్‌లైన్ లీకేజీ వంటి పనులకు పంచాయతీ కార్యదర్శులే అప్పులు తెచ్చిపెట్టుబడులు పెడుతున్నారు. దీంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పాటు, మంజూరైన నిధులకు కూడా బిల్లులు పాస్ కాకపోవడంతో కార్యదర్శులంతా ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని ప్రత్యేకాధికారులు

జిల్లాలో సర్పంచుల పాలన పూర్తియిన 22 నెలలు పూర్తయింది. కానీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా, ప్రత్యేకాధికారులతోనే పాలన కొనసాగిస్తోంది. కానీ ప్రత్యేకాధికారులు గ్రామపంచాయతీ పాలనలో అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. బిల్లులు సమర్పిస్తున్న సమయంలో మాత్రం ప్రత్యేకాధికారులు ఇంత ఖర్చు ఎలా అయింది, ఎప్పుడు పెట్టారంటూ పంచాయతీ కార్యదర్శులను నిలదీస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. దీంతో బరువు బాధ్యతలంతా పంచాయతీ కార్యదర్శులపై పడుతుండటంతో వారికి పనిభారంతో పాటు, అప్పుల భారం కూడా అధికమై ఆందోళన చెందుతున్నారు.

పండగల ఏర్పాట్లకు పెట్టినా.. అందని బిల్లులు

జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు ఇటీవల జరిగిన దసరా, బతుకమ్మ పండగల ఏర్పాట్లకు పంచాయతీ కార్యదర్శులే అప్పులు చేసి ఏర్పాట్లు చేశారు. వాటికి సంబంధించిన బిల్లులు కూడా ఇప్పటి వరకు వారికి విడుదల కాకపోవడంతో బిల్లులు రాక మళ్లీ పనులకు పెట్టుబడి పెట్టే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహారం గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్

కథలాపూర్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి అన్నారు. సోమవారం కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఏ ఏ ఆహార పదార్థాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, రమ, వనిత, స్వరూప, ఆశా కార్యకర్తలు లత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పిల్లలు, తల్లుల సంపూర్ణ ఆరోగ్యమే ఐసీడీఎస్ లక్ష్యం

కొడిమ్యాల: పిల్లలు, తల్లుల సంపూర్ణ ఆరోగ్యమే ఐసీడీఎస్ లక్ష్యమని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వరూప మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. సీడీపీవో వీరలక్ష్మి మాట్లాడుతూ గర్భస్థ శిశువు ఎదుగుదలకు ప్రోటీన్లతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో అరవింద, ఎంఈవో అయిత శ్రీనివాస్, ఏపీఎం. మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్ : చిన్నారులు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీవో కృపాకర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పోషణ మాసం నిర్వహించారు. చిన్నారులు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం నివారించేందుకు ఈ పోషణ్ మాసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో వైద్య, రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, విద్యార్థుల తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎస్‌ఈ

ఇబ్రహీంపట్నం: వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సుదర్శనం అన్నారు. మండలంలోని అమ్మక్కపేట, ఎర్దండి, వర్షకొండ విద్యుత్ సబ్‌స్టేషన్లను సోమవారం పరిశీలించారు. అమ్మక్కపేట, ఎర్దండి సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఛార్జ్ చేసి టెస్టింగ్ చేశారు. కార్యక్రమంలో డీఈలు గంగారాం, మధుసుదన్, గోపికృష్ణ, ఏడీఈలు రాజు, ప్రదీప్, ఏఈలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా... ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ



సంతకాల ప్రతులతో కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి, మోహన్‌రావుపేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ చోరీతో అధికారంలోకి వచ్చిందని దీనికి నిరసనగా కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నేత కృష్ణారావు ఆదేశాలతో సంతకాల సేకరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొంతం రాజం, సత్యనారాయణ గౌడ్, మహిపాల్ రెడ్డి, కిషన్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: 'ఓటు చోరీ'పై సంతకాల సేకరణను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉద్యమంగా చేపట్టాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటుచోరీపై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు చోరీ పద్ధతితోనే బీజేపీ మూడవసారి అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మిట్టపెల్లి జీవన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నాయకులు సిరిపురం రవీందర్, ఆనంద్‌గౌడ్, ఒడ్డె నర్సారెడ్డి, పాల్గొన్నారు.

పెరుక సంఘం రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై హర్షం

జగిత్యాలరూరల్: హైదరాబాద్‌లోని కోకాపేటలో పురగిరి క్షత్రియ పెరుక సంఘం భవనంలో జరిగిన రాష్ట్ర అధ్యక్ష పదవి ఎన్నికల్లో సీనియర్ జర్నలిస్టు గట్టిగా విజయ్‌కుమార్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికకావడం హర్షనీయమని జగిత్యాల జిల్లా పెరుక సంఘం అధ్యక్షుడు బోడ్డు బుచ్చన్న అన్నారు. సోమవారం పెరుకపల్లిలో మాట్లాడారు. రాష్ట్రంలో పెరుక కులస్తుల అభివృద్ధికి రాష్ట్ర నాయకత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బోడ్డు లక్ష్మన్, బాలముకుందం, గంగాసాగర్, రమేష్,పాల్గొన్నారు.

షాపుల నిర్వహణకు వేలం పాట

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేట గంగ గౌరీశ్వర స్వామి ఆలయం వద్ద దుకాణా(షాపు)ల నిర్వహణకు ఈ నెల 18న వేలంపాట నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి ముద్దం విక్రమ్ సోమవారం తెలిపారు. ఆలయం వద్ద నిర్వహించే దుకాణా(షాపు)ల నిర్వహణకు ప్రతీ ఏటా వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. ఈ వేలం పా టలో పాల్గొనదలిచిన వారు రూ.10వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని టౌన్–3 సెక్షన్ పరిధిలోని భవానీనగర్, బుడుగ జంగాల కాలనీ, అయ్యప్పగుడి, శాంతినగర్, పద్మనాయక కళ్యాణ మండపం, కరీంనగర్ డైరీ, కరీంనగర్ రోడ్ ఏరియా, నర్సింగాపూర్ రోడ్, ఎంఎల్‌ఏ క్యాంప్ ఆఫీస్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ డీఈ కె. గంగారాం తెలిపారు.

పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా ఉపేక్షించం



ముఖ్య కార్యకర్తలతో మాట్లాడుతున్న సయ్యద్‌గులాం

జగిత్యాలటౌన్: జిల్లాలో పార్టీని అస్థిరపరిచేందుకు కుట్రలు చేస్తే సహించేదిలేదని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎంఐఎం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ హెచ్చరించారు. పట్టణంలోని రాయల్ ఫంక్షన్‌హాలులో సోమవారం జరిగిన జిల్లా పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ హైకమాండ్ ఆదేశాలతో ఎంఐఎం పట్టణ కమిటీని రద్దు చేసినట్లు తెలిపారు. పార్టీ పదవిని అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయాలకు పాల్పడితే ఉపేక్షించే సమస్యే లేదన్నారు. జగిత్యాల మున్సిపల్ కౌన్సిల్‌పై ఎంఐఎం పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు రజియొద్దీన్ హఫీజ్ అసద్, అమెర్, ఇలియాజ్, నౌమన్, రెహాన్, వాజిద్, ఫయాజ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించడంతో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం చిత్రపటానికి సోమవారం నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఎం.డీ అజీమ్, తొట్ల అంజయ్య, చెదలు సత్యనారాయణ, కారపు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో సోమవారం కాంగ్రెస్ నాయకులు మేడిపల్లిలో ప్రజాప్రభుత్వం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్ కృషి తో రూ.150 కోట్లతో దేవస్థానం అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, రాజగౌడ్, మకిలీ ఇజ్రాయిల్, బలగం రాజేష్, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

కోరుట్ల: పట్టణంలోని హాజీపురాకు చెందిన గౌడికె హర్షవర్ధన్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్ చొరవతో రూ.2.5 ఎల్‌వోసీ మంజూరైంది. హర్షవర్ధన్ అనారోగ్యం విషయం జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావుల దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రూ. 2.5 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేశారు. బాధిత కుటుంబానికి సోమవారం అందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై సమావేశం

పెగడపల్లి: మండలంలోని ఏడుమోటలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సోమవారం ఐకేపీ అధికారులు రైతులు, మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రం కోసం ధర్మపురి నియోజకవర్గం గిరిజన సంఘం అధ్యక్షుడు నాగావత్ జీవన్ నాయక్, రైతులు కలిసి తహసీల్దార్ ఆనంద్ కుమార్‌కు విన్నవించారు. ఈ మేరకు స్థలాన్ని పరిశీలించిన అధికారులు ఈ స్థలాన్ని చదును చేసి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో ఐకేపీ అధికారులు సోమవారం స్థలాన్ని పరిశీలించి రైతులు, మహిళా సంఘలతో సమావేశం నిర్వహించి కేంద్రం ఏర్పాటుకు తీర్మానం చేశారు. సమావేశంలో ఏపీఎం రవివర్మ, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్, సీసీ శశికుమార్, వీవోఏ జ్యోతి, రైతులు పాల్గొన్నారు.



పెగడపల్లి: మండల కేంద్రంలోని ఏడో వార్డులో పగలు, రాత్రి తేడా లేకుండా పందులు సంచారం చేస్తున్నాయి. నివాస ప్రాంతంలో పందులు సంచరిస్తుండటంతో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటుందని వార్డుప్రజలు పేర్కొంటున్నారు. స్థానికంగా అధికారులు పందుల నివారణ విషయంలో మాత్రం విఫలమవుతున్నారు. అసలే వర్షాకాలం ఆపై ఇళ్ల ముందర పందులు తిరుగుతుండటంతో వాటివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందంటున్నారు కాలనీ ప్రజలు. అధికారులు స్పందించి పందులను నివారించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి,పెగడపల్లి సెల్ నంబర్: 9849524233

జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

జగిత్యాలటౌన్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం డిమాండ్ చేశారు. జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట నల్ల జెండాలతో నిరసన తెలిపారు. అనంతరం గంగా రాం మాట్లాడుతూ అక్టోబర్ 7 భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ మీద జరిగిన దాడి అనాగరికమైందన్నారు. దళితుడైన బీఆర్ గవాయ్ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కావడాన్ని జీర్ణించుకోలేని కొన్ని శక్తులు కుట్రపూరితంగా దాడికి పాల్పడ్డాయని ఆరోపించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బెజ్జంకి సంతోశ్, బోనగిరి కిషన్, రాజ్‌కుమార్, బొల్లె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటలక్ష్మి తెలిపారు. పాఠశాలకు చెందిన రిషిక, సంజన కబడ్డీ పోటీలకు, నిషిత ఖోఖో పోటీలకు ఎంపిక కాగా, సోమవారం పాఠశాల హెచ్‌ఎం లతదేవి, పాఠశాల చైర్మన్ నీరటి సుకన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

రాయికల్: పట్టణంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన పోతరాజు అద్విత, మండ నరేందర్, సార్ల నిశ్వాంత్, మధుప్రియ అండర్ –14 ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మహేశ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం రాజేశ్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ క్రీడలకు రేచపల్లి విద్యార్థుల ఎంపిక

సారంగాపూర్: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ క్రీడలకు మండలంలోని రేచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు టి.బన్నీ, యూ విగ్నేశ్‌లు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో ఈ నెల 16,17,18 తేదీల్లో జరగబోయే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఈ ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారని రేచపల్లి ఉన్నత పాఠశాల పీడీ రాము తెలిపారు.

విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో కాంస్య పతకం



రోషన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాలజోన్: రాష్ట్ర స్థాయిలో జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన బోల్లె రోషన్ అనే విద్యార్థి టైక్వాండో పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. జిల్లా కేంద్రంలోని శ్రీ వాగ్దేవి హైస్కూల్‌కు చెందిన రోషన్ అనే విద్యార్థి, నిజమాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయిలో టైక్వాండో పోటీల్లో జగిత్యాల జిల్లా తరుపున పాల్గొని, కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థి రోషన్‌ను స్కూల్ గేమ్స్ సెక్రటరీ చక్రధర్‌రావు, అసోసియేషన్ సెక్రటరీ గాదె సంతోష్, పాఠశాల ప్రిన్సిపాల్ సింగం సునీతరాణిలు, కోచ్‌లు దావనపెల్లి రాహుల్ కుమార్‌లు అభినందించారు.

మల్లాపూర్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రుత్విక్ ఎంపికవడం గర్వకారణమని కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి రుత్విక్‌ను సన్మానించి అభినందించారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి రుత్విక్‌కి రూ.2వేల నగదు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రమోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్దం శరత్ గౌడ్, డైరెక్టర్ నూతిపెల్లి రాజం, మొరపు గంగరాజం, ఆకుతోట రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సౌభాగ్య ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్: సౌభాగ్య ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, మహిళలు, సీనియర్ సిటిజన్లకు సాధారణ వడ్డీ 8.00, బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.7 వేలు అందిస్తున్నామని, దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆయన వెంట డీఈ వేణుగోపాల్ ఉన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

రాయికల్: పట్టణంలోని లలితాంబిక ఆలయంలో సోమవారం గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మహేశ్, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

13కేటీఆర్ 202: క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు